## నీటి సమస్యను పరిష్కరించాలి



మేయర్‌ లతాప్రేమ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పద్మశ్రీహిల్స్‌ కాలనీ వాసులు

బండ్లగూడ: ప్రజలకు మంచినీటి ఇబ్బందులు రాకుండా చూసేందుకు ప్రణాళిక రూపొందిస్తామని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ మేయర్‌ లతాప్రేమ్‌గౌడ్‌ అన్నారు. కార్పొరేషన్‌ పరిధిలోని పద్మశ్రీహిల్స్‌ కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు కాలనీలో నీటి సమస్యపై శనివారం మేయర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కాలనీకి సరిపోయే కొత్త వాటర్‌ ట్యాంక్‌ నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. జలమండలి అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి కొత్త వాటర్‌ ట్యాంక్‌ ఏర్పాటు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## త్వరలో అండర్‌పాస్‌ నిర్మాణం



గగన్‌ పహాడ్‌ అండర్‌ పాస్‌ నిర్మాణం కోసం అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

మైలార్‌దేవ్‌పల్లి: గగన్‌ పహాడ్‌ ప్రధాన రహదారిపై తొందరలోనే అండర్‌ పాస్‌ రోడ్డును నిర్మించనున్నారని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి ప్రకాష్‌గౌడ్‌ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ పరిధిలోని గగన్‌ పహాడ్‌ బెంగుళూర్‌ హైవే పై ప్రజలు రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు గతంలో ఎమ్మెల్యేకు వివరించడంతో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ అండర్‌ పాస్‌ రోడ్డును నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కావడంతో శనివారం నేషనల్‌ హైవే అథారిటీ అధికారులతో గగన్‌ పహాడ్‌లోని రహదారిని పరిశీలించారు. తొందరలోనే అండర్‌ పాస్‌ నిర్మాణం పనులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక కాంగ్రెస్‌ నాయకులు సరికొండ వెంకటేష్‌, బీజేపీ నాయకులు వినయ్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు స్థానికులు ఉన్నారు.

## మున్సిపల్‌ కార్మికుల సేవలు ఎంతో గొప్పవి



తీర్థయాత్ర బస్సుకు పూజలు చేస్తున్న బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ డిప్యూటీ మేయర్‌ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు ఎంతో గొప్పవని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ డిప్యూటీ మేయర్‌ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్‌ పరిధిలోని హైదర్షాకోట్‌ గ్రామంలో పని చేస్తున్న మున్సిపల్‌ పారిశుద్ధ్య కార్మికులను తన సొంత ఖర్చుతో తీర్థయాత్రలకు పంపించారు. ఈ సందర్భంగా శనివారం తీర్థయాత్ర బస్సుకు ఆయన పూజలు చేసి పంపించారు. అనంతరం మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా చెత్తచెదారాలు, వ్యర్థాలలో పనులు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ టింకురెడ్డి తదితరులున్నారు.

## పదవీ విరమణ పొందిన సిబ్బందికి సన్మానం



ఏజీవర్సిటీ: ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పదవీ విరమణ పొందిన సిబ్బందికి వర్సిటీ రిజిస్ట్రార్‌ రఘురామిరెడ్డి, సిబ్బంది ఘనంగా సన్మానించారు. విశ్వవిద్యాలయం డీన్‌ ఆఫ్‌ అగ్రికల్చర్‌ డాక్టర్‌ సీమ, విస్తరణ సంచాలకులు డాక్టర్‌ వి సుధారాణి, ఆఫీస్‌ సబార్డినేట్‌ బి అశోక్‌ ల ఉద్యోగ విరమణ చేశారు. శనివారం రాజేంద్రనగర్‌లోన వాటర్‌ టెక్నాలజీ సెంటర్‌ ఆడిటోరియంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు.

## అత్తాపూర్‌లో కార్డెన్‌ సెర్చ్‌



అత్తాపూర్‌: అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకట్ట వేసేందుకు కార్డెన్‌ సెర్చ్‌ ఉపయోగపడుతుందని అత్తాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం అత్తాపూర్‌ డివిజన్‌ పరిధిలోని జలాల్‌ బాబానగర్‌, హసన్‌ నగర్‌ భూపాల్‌ నగర్‌, రాజేంద్రనగర్‌ ఆర్డీవో కార్యాలయం అటవీ ప్రాంతం, సర్దార్‌ వల్లాభాయ్‌ పటేల్‌ పోలీస్‌ అకాడమీ వెనుక ప్రాంతంలో కార్డెన్‌ సెర్చ్‌ నిర్వహించారు. రాజేంద్రనగర్‌ డివిజన్‌ ఇన్‌స్పెక్టర్లు నాగేంద్రబాబు, మైలార్దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌ మధు నాయకత్వంలో అత్తాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ జి.వెంకటరామిరెడ్డి నేతృత్వంలో కార్డన్‌ సెర్చ్‌ నిర్వహించారు. ద్విచక్రవాహనాలను,ఆటోలు, ట్రాలీలలో తనిఖీలు నిర్వహించారు.

## ఉత్సాహంగా గ్రీన్‌ డే



గోల్కొండ: సబ్జిబండి శాంతినికేతన్‌ పాఠశాలలో గ్రీన్‌ డేను సంబరంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్‌ కె.శశిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పచ్చరంగుల విశిష్టతలను తెలిపే చిత్రాల పోస్టర్లను తయారు చేసి అబురపరిచారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌ శశిపాల్‌రెడ్డి మాట్లాడుతూ..ఆకుపచ్చరంగు సకల జీవకోటికి సంబంధించిందన్నారు. మన జీవితాలపై ఆకుపచ్చరంగు సానుకూల ప్రభావాలు చూపెడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



చందానగర్‌ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌ సర్వీస్‌ రోడ్డు అసంపూర్తిగా ఉన్న దృశ్యం



ప్రమాదకరంగా ఫ్లైఓవర్‌ ర్యాంపు గుంత

# నత్తనడకన ఫ్లైఓవర్‌ పనులు

## చందానగర్‌ జాతీయ రహదారిపై వాహనాల ట్రా'ఫికర్‌'



అసంపూర్తిగా ఉన్న సర్వీస్‌ రోడ్డులో కార్ల పార్కింగ్‌



రోడ్డు విస్తరణలో అసంపూర్తి నాలా పనులు

- పూర్తి కాని సర్వీస్‌ రోడ్డు
- రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్‌

హఫీజ్‌పేట్‌: చందానగర్‌ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్‌ జామ్‌లతో వాహనదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. ఫ్లైఓవర్‌ నిర్మించేటపుడు రెండు సర్వీస్‌ రోడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ ఒకవైపు సర్వీస్‌ రోడ్డు పూర్తి చేశారు. మరోపక్క అసంపూర్తిగా ఉంది. దీనికితోడు ఫ్లైఓవర్‌ ర్యాంపు కోసం తవ్వి వదిలేసిన రోడ్డు లోతుగా గుంత ఉంది. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఈ గుంతలో వరద నీరు చేరితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రోడ్డు కోసం తవ్విన గుంత పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఫ్లైఓవర్‌ నిర్మాణ పనుల్లో ఆలస్యంతో చందానగర్‌ ప్రధాన రోడ్డుపై ఉన్న వ్యాపార సముదాయాలకు వచ్చే వారు కార్లు, ద్విచక్ర వాహనాలు జాతీయ రహదారి పక్కనే పార్క్‌ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌ పోలీసులు చలానాలు వేస్తున్నారు.

**సమస్యలు ఇవే..**

- హైదరాబాద్‌– ముంబాయి జాతీయ రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతంలో వ్యాపార సముదాయాలు ఉండడంతో షాపింగ్‌కు వచ్చేవారు తమ వాహనాలను రోడ్ల పక్కన ఆపుతున్నారు.
- సర్వీస్‌ రోడ్డు ఒకవైపు పూర్తి చేశారు. మరోవైపు పూర్తికాకపోవడంతో అక్రమ పార్కింగ్‌ వల్ల సమస్యలు వస్తున్నాయి.
- చందానగర్‌–లింగంపల్లి నాలా వరకు ఉన్న షాపులకు వచ్చే వారికి పార్కింగ్‌ సమస్య వస్తోంది.
- ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్‌ జామ్‌లు ఏర్పడుతున్నాయి.
- సర్వీస్‌ రోడ్డుపైనే వాహనాలు నిలపడం వలన తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి.
- జాతీయ రహదారిపై ఫ్లైఓవర్‌ పనులు జరుగుతున్నాయనే సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- జాతీయ రహదారిపై దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### సర్వీస్‌ రోడ్డు పూర్తి చేయాలి



చందానగర్‌ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌కు ఇరువైపులా సర్వీస్‌ రోడ్డు నిర్మించాలి. కానీ ఒకవైపు నిర్మించి మరోవైపు వదిలేశారు. వెంటనే అసంపూర్తిగా ఉన్న సర్వీస్‌ రోడ్డు పనులు ప్రారంభించాలి.

–రామకృష్ణ గౌడ్‌, చందానగర్‌

### చలానాలు వేస్తున్నాం



జాతీయ రహదారిపై ఫ్లైఓవర్‌ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో సర్వీస్‌ రోడ్డుపై వాహనాలు నిలిపిన వారికి చలానాలను విధిస్తున్నాం. ట్రాఫిక్‌ జామ్‌లు కాకుండా వాహనాలు రోడ్డుపై పార్కింగ్‌ చేయొద్దని కోరుతున్నాం. అంతే కాకుండా రాంగ్‌ రూట్‌లో వస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

–పవన్‌కుమార్‌, ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌, ఆర్సీపురం

## మజ్లిస్‌ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



మజ్లిస్‌ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: మజ్లిస్‌ నాయకులందరూ తమ ప్రాంతంలోని ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో గోల్కొండ, టోలిచౌకీ, నానల్‌నగర్‌ డివిజన్‌కు చెందిన మజ్లిస్‌ నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్‌ సీనియర్‌ నాయకులతో పాటు మజ్లిస్‌ ఏరియా కమిటీ సభ్యులందరూ ప్రతినిత్యం క్రియాశీలకంగా ఉండాలని స్పష్టం చేశారు. టోలిచౌకీ, గోల్కొండ డివిజన్‌లలో భారీ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని దీన్ని వల్ల ఎండిలైన్స్‌ చౌరస్తా, కంపెనీ బాగ్‌, టోలిచౌకీ చౌరస్తా, టూమ్స్‌ రోడ్‌ తదితర ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆయన అన్నారు. వర్షాకాలంలో డ్రైనేజీలు పొంగడం, చెత్త కుప్పలు పేరుకుపోవడం లాంటి సమస్యలు ఉండకుండా చూడాలన్నారు. ఆయనను కలిసిన వారిలో అబీబ్‌బిన్‌ మోసిన్‌ బాకుల్కా, ఖదీర్‌ తదితరులున్నారు.

## రోడ్లకు మరమ్మతులు చేయండి



గుంతలమయంగా మారిన రోడ్డును చూపిస్తున్న రాజేంద్రనగర్‌ డివిజన్‌ ఓబీసీ మోర్చా అధ్యక్షులు మల్లేష్‌ చారి

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో గుంతలమయంగా మారిన రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాజేంద్రనగర్‌ డివిజన్‌ ఓబీసీ మోర్చా అధ్యక్షులు మల్లేష్‌ చారి అన్నారు. డివిజన్‌లోని ఎర్రబోడ, చైతన్య విలాస్‌ కాలనీ, మాధవ్‌ స్వీట్‌ హౌస్‌ నుంచి మొదలు పెట్టుకుంటే ఉప్పర్‌పల్లి వరకు చైతన్య విలాస్‌ మెయిన్‌ రోడ్డు ఇటీవల వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయిందన్నారు. దీంతో గుంతల్లో నీళ్లు నిలవడం, నీటిలో దోమల బెడద ఎక్కు కావడంతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉదయం స్కూల్‌కు వెళ్లే పిల్లలు, రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు నడవలేని పరిస్థితి నెలకొందన్నారు. దీనిపై జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

## జైగోమాటిక్‌ ఇంప్లాంట్స్‌పై అవగాహన



డాక్టర్‌ సునీల్‌ కోతావర్‌

అబిడ్స్‌: డెంటల్‌ ఇంప్లాంట్ల రంగంలో తీవ్రమైన దవడ ఎముక నష్టం ఉన్న రోగులకు జైగోమాటిక్‌ ఇంప్లాంటు ఒక ఆధునిక పరిష్కారమవుతుందని ఏఐఏడీ సొసైటీ అధ్యక్షుడు, ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్‌ సునీల్‌ కోతావర్‌ పేర్కొన్నారు. సాధారణంగా ఇంప్లాంట్లు వేయడానికి బలమైన ఎముక అవసరమవుతుందన్నారు. కాని పైన దవడ తక్కువ ఎముక ఉన్న వ్యక్తులకు రెగ్యులర్‌ ఇంప్లాంట్లు వేయడానికి సవాళ్లు ఎదురవుతుండడంతో జైగోమాటిక్‌ ఇంప్లాంట్లు వేస్తున్నామన్నారు. శనివారం ఏఐఏడీ ఆధ్వర్యంలో జైగోమాటిక్‌ ఇంప్లాంట్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ సునీల్‌ కోతావర్‌ మాట్లాడుతూ..జైగోమాటిక్‌ ఇంప్లాంట్లు రెగ్యులర్‌ ఇంప్లాంట్ల కంటే పొడువుగా ఉంటాయన్నారు. జైగోమ ఎముక నుంచి సపోర్టు తీసుకోవడం ద్వారా దట్టంగా, స్థిరమైన పునాదిని ఇస్తుందన్నారు. సరైన నైపుణ్యం, సాంకేతిక పద్ధతులతో జై గోమాటిక్‌ ఇంప్లాంట్లు చిరునవ్వులను పునరుద్ధరిస్తాయని డాక్టర్‌ సునీల్‌ కోతావర్‌ పేర్కొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

### జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి



జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డికి పూలమొక్కను అందిస్తున్న కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్‌ శేరిలింగంపల్లి జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డిని గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి శనివారం ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించి పూలమొక్కను అందించారు. అనంతరం గచ్చిబౌలి డివిజన్‌లోని కాలనీలు ,బస్తీలలో నెలకొన్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, కేశవనగర్‌, గోపన్‌పల్లి, నల్లగండ్ల హుడా కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సీసీరోడ్లు, మంచినీరు, విద్యుత్‌ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే సాయిఐశ్వర్య కాలనీలో ఉన్న పార్కు స్థలంలో ఓపెన్‌జిమ్‌, చిల్డ్రన్స్‌ పార్కు, క్రీడాప్రాంగణం, ప్రహరీగోడ, కేశవనగర్‌లో శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్‌,. హన్మంతునాయక్‌, తిరుపతి, నర్సింగ్‌ నాయక్‌, శేఖర్‌, రాజు, శ్రీనివాస్‌, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కనువిందు.. నృత్య ప్రదర్శన

మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం బెంగుళూరికి చెందిన భరతనాట్య గురువు ప్రతిభ రామస్వామి శిష్యబృందం నృత్య ప్రదర్శన అలరించింది. ఇందులో ఆనందనర్తన గణపతిం, త్రిమూర్తి అంజలి, నటనవాడినల్‌, దేవీస్తుతి, మహాదేవ కాంచీపురాధీశ్వర, సప్తస్వర, వర్ణం తదితర అంశాలను కళాకారులు అవంతిక, ధన్య, పూజ, సంజన, శ్రావ్యలు ప్రదర్శించారు. కోల్‌కత్తాకు చెందిన ఒడిసి నృత్య కళాకారిణి ఆత్రేయిదత్త ఒడిస్సీ నృత్య ప్రదర్శనలో మంగళచరణ్‌, మధురాష్టకం మోక్ష అంశాలను ప్రదర్శించారు.

**అన్నమయ్యపురంలో..**

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం విభావరి డ్యాన్స్‌ అకాడమీ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. అనంతరం సంస్థ అధ్యక్షురాలు డాక్టర్‌ శోభారాజు కళాకారులను అభినందించారు.



## బస్తీల్లో మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం

### గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి



కేశవనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌ గౌలిదొడ్డి, కేశవనగర్‌ బస్తీలలో ఆయన శనివారం పర్యటించారు. ఆయా బస్తీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు ఫోన్‌ ద్వారా సమస్యలను వివరించి పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచినీటి పైప్‌లైన్‌ల నిర్మాణం, శ్మశానవాటికల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మంతునాయక్‌, తిరుపతి, కిషన్‌, భిక్షపతి, ఈశ్వర్‌, సునీల్‌, కృష్ణ, నర్సింగ్‌నాయక్‌, శేఖర్‌, రమేష్‌, సురేష్‌, ప్రసాద్‌, బాబు పాల్గొన్నారు.

## టీహబ్‌లో టచ్‌ ఎ లైఫ్‌ వార్షికోత్సవం



రాయదుర్గం: స్పర్శ అనేది సంఘటన కాదని, ఇది పరివర్తన శక్తికి నిదర్శనమని టచ్‌ ఏ లైఫ్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు విభూతిజైన్‌, రినాహిందోచా వెల్లడించారు. హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీహబ్‌ ప్రాంగణంలో టచ్‌ ఏ లైఫ్‌ స్పర్శ పేరిట పదో వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ దాతలు, ప్రముఖులను ఒకచోట చేర్చి బాలికల విద్యను ప్రోత్సహించడంలో ఫౌండేషన్‌ కృషి చేస్తుందన్నారు. బాలికలకు సాధికారత కల్పించడం ద్వారా సంఘానికి ఉజ్వల భవిష్యత్తును సృష్టించే ఒక స్పార్క్‌ను వెలిగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీహబ్‌ సీఈఓ శ్రీనివాసరావు మహంకాళి, మైరాన్‌ హోమ్స్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ అశ్రిత వేముగంటి, కిస్టోన్‌ స్కూల్‌ వ్యవస్థాపకుడు, డైరెక్టర్‌ శ్రీలక్ష్మీరెడ్డి, శ్రీనివాస్‌ తీర్థాల, మహ్మద్‌ ఖలీకర్‌ రహమాన్‌, జ్యోతిచంద్ర, సంస్థ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.



# జాతీయ రహదారి.. చెత్తగా మారి..

- పేరుకుపోతున్న వ్యర్థాలు..
- కంపు కొడుతున్న పరిసరాలు
- ఇబ్బందులు పడుతున్న బస్తీల వాసులు
- స్పందించని అధికారులు



రహదారిలో పైప్‌లైన్‌ నిర్మాణం పనులు



రహదారిలో నిలిచి ఉన్న స్వచ్ఛ్‌ ఆటోలు

జియాగూడ: పురానాపూల్‌ చౌరస్తా నుంచి రాంసింగ్‌పురా వరకు గల జాతీయ రహదారిలో తీవ్రస్థాయిలో సమస్యలు నెలకొన్నాయి. పురానాపూల్‌ చౌరస్తా నుంచి మొదలైన 100 ఫీట్ల జాతీయ రహదారిలో పైప్‌లైన్‌ నిర్మాణం పనులు ఒక వైపు చెత్త డంపింగ్‌యార్డు, మేకలమండిల వల్ల రహదారి పూర్తిగా చెత్తమయంగా మారింది. దీంతో ఇరుపక్కల గల బస్తీల వాసులు ఇబ్బందులు పడుతూ గొడవలకు దిగడం సర్వసాధారణంగా మారిది. జియాగూడ రహదారి కూడా సమస్యలకు నిలయంగా ఉండడంతో ఆర్టీసీ బస్సులు జాతీయ రహదారి గుండానే రాకపోకలు కొనసాగిస్తుండగా చెత్త డంపింగ్‌యార్డు, మేకలమండి కారణంగా ట్రాఫిక్‌ సమస్యతో ఆలస్యమవుతుంది. దీంతో ప్రయాణికులు సైతం సరైన సమయంలో తమ తమ గమ్యాలకు వెళ్లలేకపోతున్నారు. అత్తాపూర్‌ నుంచి హైకోర్టుకు వెళ్లే రహదారి ఇదే కావడంతో జడ్జీలు వెళ్లే సమయంలో ట్రాఫిక్‌ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అనంతరం పట్టించుకోవడం లేదు.

**చెత్త డంపింగ్‌ యార్డుతో ఇబ్బందులు..**

జాతీయ రహదారిలో చెత్త డంపింగ్‌యార్డు ఉండం వల్ల జియాగూడ ఇతర సర్కిళ్లకు చెందిన స్వచ్ఛ్‌ చెత్త ఆటోలు డంపింగ్‌యార్డు ఇరు పక్కల గంటల తరబడి నిలిచి ఉంటున్నాయి. డంపింగ్‌యార్డు ఇన్‌చార్జి ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్వచ్ఛ్‌ ఆటోల సిబంది ఆరోపిస్తున్నారు. అలాగే స్వచ్ఛ్‌ ఆటోలు రోడ్డుపై నిలిపిన సమయంలో గాలికి చెత్త ఎగరడం, దుర్వాసన వెదజల్లడంతో న్యూ గంగానగర్‌, కేశవస్వామినగర్‌, నవోదయనగర్‌, దరియాబాగ్‌ వాసులు తరచూ గొడవలకు దిగుతున్నారు. చెత్త ట్రక్కులు రోడ్డుపై ఉండడంగో ట్రాఫిక్‌ సమస్య తలెత్తుతుంది. అలాగే మేకలమండికి వచ్చే వాహనాలు, భారీ లారీలు రోడ్డుపైనే నిలిపివేయడంతో రహదారిలో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇది చాలదన్నాట్లు రహదారిలో మూడుచోట్ల వైన్స్‌లు, బార్‌లు ఉండగా మద్యంకు వచ్చేవారు వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు.

**ఎంతకూ పూర్తికాని పైప్‌లైన్‌ నిర్మాణం పనులు..**

జాతీయ రహదారిలో పైప్‌లైన్‌ నిర్మాణం పనులు సుమారు రెండేళ్ల నుంచి కొనసాగుతున్నాయి. ఎంతకీ పూర్తి కావడంలేదు. రహదారి పలు చోట్ల నిర్మాణం కారణంగా ట్రాఫిక్‌ మళ్లింపుతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని బస్తీలవాసులు కోరుతున్నారు.